ప్రజాశక్తి

ఆదివారం 10 ఆగస్టు 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

శంకర్ విలాస్ బ్రిడ్జి కూల్చివేత ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరులో చారిత్రక కట్టడంగా ఉన్న శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి కూల్చివేత పనులు శనివారం ప్రారంభమయ్యాయి. దాదాపు 75 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఈ బ్రిడ్జి దాదాపుగా పటిష్టంగానే ఉంది. అయితే పెరుగుతున్న రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం ఈ బ్రిడ్జిని తొలగించి అధునాతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టగా పనులు ప్రారంభం కావడంతో పాత బ్రిడ్జితొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ వీలైనంత త్వరగా నూతన బ్రిడ్జి నిర్మాణం పూర్తి

▸ 2లో

రేషన్‌లో కొత్త అక్రమాలు

- మొదటి వారంలోనే నో స్టాక్ బోర్డులు
- 15 రోజుల పంపిణీ రెండ్రోజుల్లో పూర్తి
- ఒకేరోజు 400 మందికి బయోమెట్రిక్‌తో నగదు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రేషన్ డీలర్ల అక్రమాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గత నెల ఒకటో తేదీ నుంచి ఎమ్‌డియు వాహనాల స్థానంలో డీలర్లకు రేషన్ పంపిణీకి ప్రభుత్వం తిరిగి బాధ్యతలు అప్పగించింది. కానీ డీలర్లు కూడా కొత్త అక్రమాలకు తెరలేపారు. ప్రభుత్వం ఇచ్చిన ఒన్ నేషన్, ఒన్ రేషన్ నినాదంతో పోర్టబులిటీ ద్వారా ఎవరు ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చనే విధానాన్ని గుంటూరులో పలువురు డీలర్లు దుర్వినియోగం చేసి పేదలకు బియ్యం లేవని నో స్టాక్ బోర్డులు పెడుతున్నారు. ఒకటో తేదీ నుంచి 15 వ తేదీ వరకు రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా ప్రతినెలా మొదటి



వారంలోనే నో స్టాక్ బోర్డులు వెలుస్తున్నాయి. పోర్టబులిటీ విధానం ద్వారా ఎక్కడి వారు అయినా తమకు దగ్గరలోని డిపో నుంచి రేషన్ బియ్యం తీసుకునే అవకాశాన్ని కల్పించగా దీనిని పలువురు డీలర్లు తప్పుడు మార్గంలో తమకు అనుకూలంగా

▸ 2లో

శంకర్ విలాస్ ఫ్లైఓవర్‌పై స్టే ఎత్తేయలేదు

కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యలు సత్యదూరం : జెఎసి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న భారవి, ఇతర జెఎసి నాయకులు

శంకర్ విలాస్ ఫ్లైఓవర్ కేసు ఇప్పటి వరకూ హైకోర్టులో స్టేటస్‌కోలో ఉన్నప్పటికీ బ్రిడ్జి నిర్మాణంలో మొండిగా ముందుకు వెళుతూ ప్రజలను పక్కదారి పట్టించేలా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతున్నారని శంకర్ విలాస్ ఫ్లైఓవర్ సాధన జెఎసి కన్వీనర్ ఎల్.ఎస్.భారవి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక అరండల్‌పేటలోని ఓ హోటల్లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన విధంగా హిందూ కాలేజి నుండి లాడ్జి సెంటర్ వరకూ సింగిల్ పిల్లర్ ఐకానిక్ ఫ్లైవర్ నిర్మించాలన్నారు. కానీ చాలీచాలని నిధులతో బ్రిడ్జి పొడవు కుదించి నిర్మించటం సరికాదన్నారు. ఈ క్రమంలో శంకర్ విలాస్ ఫ్లైఓవర్‌పై నగర ప్రజల విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని హైకోర్టును ఆశ్రయించగా ప్రభుత్వ విధానాన్ని ప్రశిస్తూ, పూర్తి స్థాయిలో వివరణ కోరిందని, ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణం, డ్రెయినేజీ తదితర సౌకర్యాలపై పూర్తి వివరాలతో ఈనెల 20న వింటామని న్యాయ స్థానం చెప్పిందని తెలిపారు. అయినప్పటికీ హైకోర్టును పక్కదారి పట్టిస్తూ మొండిగా ముందుకు వెళ్లటం సరికాదన్నారు. ఈ అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళతామని చెప్పారు. జెఎసి కో-కన్వీనర్ ఎన్.వి.కమలకాంత్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోగా బ్రిడ్జి నిర్మాణానికి ఇంత వరకూ డిపిఆర్ సిద్ధం కాలేదని తెలుస్తోందన్నారు. బ్రాడీపేట, అరండల్‌పేటను అనుసంధానం చేసే బ్రిడ్జిని కూల్చటం కోర్టు ఆదేశాల ఉల్లంఘనేనన్నారు. సమావేశంలో జెఎసి నాయకులు వల్లూరు సదాశివరావు, బెల్లంకొండ శ్రీనివాసరావు, అవధానుల హరి, ఏడుకొండలు, దుర్గాప్రసాద్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆవిష్కరణల సూచీలో దేశాన్ని అగ్రభాగాన నిలపాలి

ఆర్‌విఆర్ జెసి గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో జస్టిస్ ఎన్.వి.రమణ

8లో

కిడ్నీ బాధితులకు డయాలసిస్ పరికరాలు అందుబాటులో ఉంచాలి



పెదపరిమిలో రైతులతో మాట్లాడుతున్న శివనాగరాణి

అవసరానికి మించి భూ సమీకరణ

- సారవంతమైన పొలాల్ని బలవంతంగా లాక్కోవద్దు
- కార్పొరేట్లకు కట్టబెట్టి రైతుల్ని బజారుకీడుస్తున్న ప్రభుత్వం
- మలివిడత భూ సమీకరణకు రైతుల నుండి వ్యతిరేకత
- చట్టాలు, హక్కులపై నేడు విజయవాడలో చర్చావేదిక

ప్రజాశక్తి - తుళ్లూరు

అభివృద్ధి పేరుతో రైతుల భూములను అవసరానికి మించి లాక్కోవడం, సారవంతమైన పంట భూములను ఇష్టానుసారం బలవంతంగా తీసుకోవాలనుకోవటం సరైంది కాదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు వంకాయలపాటి శివనాగరాణి అన్నారు. 2015లో భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్) నుంచి మండలంలోని పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం గ్రామాలను ప్రభుత్వం మినహాయించింది. దీంతో ఈ మూడు గ్రామాల్లో యథావిధిగానే పంటలు సాగవుతున్నాయి. తాజాగా రాజధాని నిర్మాణానికి మలి విడత భూ సమీకరణకు ప్రభుత్వం తెరతీసింది. పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురంలోని పొలాలను భూ సమీకరణ ద్వారా తీసుకోవాలని నిర్ణయించిన నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ప్రజా సంఘాల నాయకులు ఎం.రవితో కలిసి శివనాగరాణి శనివారం

▸ 2లో



నిండుకుండలా ప్రవహిస్తున్న మద్రాసు కాల్వ

డెల్టా కాల్వలకు జలకళ

ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రకాశం బ్యారేజి వద్ద పూర్తిస్థాయి నీటిమట్టం ఉండటంతో 50,750 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డెల్టా ప్రధాన కాల్వ అయిన బకింగ్‌హాం కెనాల్ పూర్తిస్థాయి సామర్థ్యం 8 వేల క్యూసెక్కులు కాగా శనివారం 7713 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దుగ్గిరాల వద్ద ప్రధాన కాల్వ నుండి సాగునీటి కాల్వలకూ పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నట్లు కృష్ణ పశ్చిమ డెల్టా సెంట్రల్ సబ్ డివిజన్ డిఇ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు.

▸ 2లో





పంట కాల్వలోకి మురుగు నీరు..!

బహిరంగంగా మోటార్లు పెట్టి పంపింగ్ చేస్తున్నా పట్టని అధికారులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

అపార్టుమెంట్లు, పరిసరాల్లో వాడిన వ్యర్థపు నీరు బయటకు పంపే మార్గం లేక వాటిని పంట కాల్వలోకే నాలుగు ఇంజిన్ల ద్వారా మళ్లిస్తున్నారు. దీనివల్ల నీరు కలుషితమై పొలాలు పాడవడంతోపాటు ఆ నీరున్న పొలాల్లో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. పనిచేసే కూలీలు, రైతులు వ్యాధులకు గురవుతున్నారు. మండలంలోని కుంచనపల్లిలో 'డీ మార్ట్' ఎదురుగా జాతీయ రహదారి పక్కన నాలుగు ఆయిల్ ఇంజిన్లతో మురుగునీటిని పంట కాల్వలోకి బహిరంగంగానే వదులుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనికితోడు ఆంధ్రరత్న పంపింగ్ స్కీం వాటర్ మోటార్లను మరమ్మతు చేయించకుండా, కాల్వను శుభ్రం చేయకుండా, ఇప్పటికీ సాగునీరు విడుదల చేయకుండా నిర్లక్ష్య ధోరణిలో ఉన్నారని, సాగునీరు పారాల్సిన కాల్వలో మురుగు నీరు పారుతోందని రైతులు విమర్శిస్తున్నారు.

రేషన్‌లో కొత్త అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)

మార్చుకుంటున్నారు. ఒక ప్రాంతానికి చెందిన డీలర్లు మరో ప్రాంతంలోకి వెళ్లి రేషన్ ఇచ్చినట్టు బయోమెట్రిక్ వేయించుకుని సొమ్ములు ఇస్తున్నారు. తమ డిపోలో ఉన్న సరుకు అయిపోయిందని డిపో పరిధిలోని వినియోగదారులకు మొండి చేయి చూపుతున్నారు. స్టాక్ అయిపోతే కొత్త స్టాకు ఇవ్వడం లేదని పలువురు డీలర్లు చెబుతున్నారు. దీంతో ఎవరికి తోచిన విధంగా వారు బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడుతున్నారు.

గుంటూరులో ఒక్కో డిపో పరిధిలో ఒకే రోజు 400 మందికి రేషన్ ఇచ్చినట్టు ఈ పోస్ మిషన్లలో నమోదు అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. డిపోలను తనిఖీ చేసి అక్రమాలను పరిశీలించాల్సిన అధికారులు నెలవారీ మామూళ్లు తీసుకుని మిన్నంకుండి పోతున్నారు. గుంటూరులోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమాలు ఇటీవల రేషన్ డీలర్ల అసోసియేషన్ నాయకులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గత ప్రభుత్వంలో రేషన్ సరఫరాలో అక్రమాలు జరిగాయని, పేదలకివాల్సిన బియ్యం పలు రాష్ట్రాలకు అక్రమంగా ఎగుమతి అవుతున్నాయని ఆరోపణలు రావడంతో కూటమి ప్రభుత్వం ఎమ్‌డియు వాహనాలను రద్దు చేసినా మెరుగైన ఫలితాలు రావడం లేదు. రేషన్ బియ్యం బదులు కార్డు దారులకు గతంలో మాదిరిగానే ప్రజలకు బియ్యంకు బదులు డబ్బులిస్తున్నారు. డీలర్లు కూడా రేషన్ మాఫియాకు సహకరిస్తున్నా నియంత్రించాల్సిన పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్లు, విఆర్‌వోలు, ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. నిత్యం జిల్లాలో ఏదో ప్రాంతంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పోలీసులు పట్టుకుంటూనే ఉ న్నారు. రేషన్‌పంపిణీలో జాగ్రత్తలు పాటించాలని, ప్రజల నుంచి బియ్యం తిరిగి తీసుకునే విధానానికి స్వస్తి చెప్పాలని ప్రభుత్వం చెప్పినా కొంత మంది డీలర్లు పాత పద్ధతిలోనే బియ్యం బదులు వినియోగదారులకు కిలో రూ.10 నుంచి రూ.12 వరకు సొమ్ములు ఇస్తున్నారు. ప్రధానంగా డిప్యూటీ తహశీల్దార్లు ఎక్కువ మంది జిల్లాలో రేషన్ అక్రమాలను పట్టించుకోకుండా డీలర్ల వద్ద నుంచి మామూళ్లతో ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కమ్మజనసేవా సమితికి మాదల చైతన్య రూ.20 లక్షల విరాళం

ప్రజాశక్తి-గుంటూరు

కమ్మజన సేవాసమితి వసతి గృహానికి మాదల చైతన్య రూ.20 లక్షల విరాళాన్ని అందజేశారు. వసతి గృహంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో పాలకవర్గానికి అందజేసిన మాదల చైతన్య మాట్లాడుతూ ఉన్నత విద్యను బాలికలకు అందించడమే లక్ష్యంగా సంస్థ అందిస్తున్న సేవల్లో తానుకూడా భాగస్వామ్యం అవటం అదృష్టమని చెప్పారు. బాలికల్లో ప్రతిభ ఉన్నా పేదరికం అడ్డంకిగా మారి ఉన్నత విద్యను అభ్యసించలేకపోతున్నారన్నారు. బాలికల కోసం కమ్మజన సేవాసమితి ఆధ్వర్యంలో వసతి గృహాలకు నా వంతుగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతిభగల పేద విద్యార్థులకు కుల, మతాలకు అతీతంగా ప్రతి సంవత్సరం ఉపకార వేతనాలు జనచైతన్య ప్రాపర్టీస్ తరఫున అందిస్తున్నట్లు తెలిపారు. కమ్మ జన సేవాసమితి నిర్వాహకులు సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు సేవ చేయాలనే ముఖ్య ఉద్దేశంతో మాదల రత్నగిరిబాబు కుమారుడైన చైతన్య ఇలాంటి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. చైతన్య సేవలను కమ్మజన సేవాసమితి కమిటీ సభ్యులు అభినందించారు.



ఆదివాసుల సంక్షేమానికి కృషి

- సాంస్కృతిక, ఆర్థిక ఐక్యతకు ప్రోత్సాహక చర్యలు
- ప్రపంచ ఆదివాసి దినోత్సవంలో కేంద్ర మంత్రి చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



ఆదివాసీల సంక్షేమానికి కృషి చేస్తామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. సాంస్కృతిక, ఆర్థిక ఐక్యతకు ప్రోత్సాహక చర్యలు చేపడతామన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాలు శనివారం గుంటూరు కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో శనివారం నిర్వహించగా కేంద్ర మంత్రి హాజరై మాట్లాడారు. ఆదివాసీల అభివృద్ధిలో అల్లూరి సీతారామరాజు, ఏకలవ్యుడు, వెన్నెలకంటి రాఘవయ్య వంటి మహాపురుషుల సేవలు మరువలేనివన్నారు. సిఎం చంద్రబాబు సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి ఆదివాసీలకు గుర్తింపు తెచ్చారని తెలిపారు. అరకు కాఫీ బ్రాండ్ ద్వారా సాంస్కృతిక, ఆర్థిక ఐక్యతకు ప్రోత్సాహం ఉంటుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. పాఠశాలల పునరుద్ధరణలో మంత్రి నారా లోకేష్ సహకరిస్తున్నారని తెలిపారు. అడవులను వ్యవసాయ భూమిగా మార్చడం, ఆన్‌లైన్ స్కూల్ రిజిస్ట్రేషన్, బ్యాంక్ లోన్స్, ఆధార్ సమస్యలకు పరిష్కారం త్వరలో చూపుతామన్నారు. గుంటూరులో ట్రైబల్ ఆఫీసర్ నియామకం, గిరిజన భవన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయనున్నట్టు తెలిపారు. గుంటూరులో రోడ్లు, డ్రెయినేజ్, విద్యుత్ లైటింగ్ పనులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వరరావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బుర్ల రామాంజనేయులు, గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నశీర్ అహ్మద్, గల్లా మాధవి, కమిషనర్ పి.శ్రీనివాసులు, డిసిఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, డిప్యూటీ మేయర్ సజీల, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, గిరిజన సంక్షేమ అధికారి మురళీధర్, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. తొలుత గిరిజన నేతల విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు.

మహిళల సాధికారతకు నైపుణ్య శిక్షణ



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మహిళల ఆర్థిక స్వావలంబన దేశ అభివృద్ధికి నైపుణ్య శిక్షణతో మంచి ఫలితాలు సాధించవచ్చని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం గుంటూరు తూర్పు నియోజవర్గంలో ఎమ్మెల్యే నశీర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల టైలరింగ్ శిక్షణా కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. విశ్వకర్మ యోజన, ముద్రా లోన్‌లు వంటి కేంద్ర పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత మిషన్లు, శిక్షణా కార్యక్రమాలు మహిళలకు వ్యాపార అవకాశాలు పెంచుతున్నాయన్నారు. టైలరింగ్ రంగంలో ఆధునిక డిజైన్‌లు, మార్కెటింగ్ టెక్నిక్స్, డిజిటల్ టూల్స్ నేర్చుకుంటే మహిళలు గ్లోబల్ మార్కెట్లో కూడా పోటీ పడగలరన్నారు. మహిళలు సెల్ఫ్-హెల్ప్ గ్రూపులు ద్వారా వివాహాలు, పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక డ్రెస్‌లు తయారు చేయడం, ఫ్యాషన్ డిజైనింగ్ సంస్థలతో అనుసంధానం కావాలని సూచించారు. పట్టుదల, కృషి ఉంటే, గుంటూరు ప్రాంతం అద్భుత అభివృద్ధి సాధించగలదని విశ్వాసం పెరుగుతందన్నారు. అవసరమైతే, లోన్లు కావాలంటే, ఎంపీల సహకారంతో బ్యాంకర్లను సంప్రదించి సహాయం పొందవచ్చన్నారు. కారక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, టిడిపి నాయకులు దాసరి రాజా మాస్టారు, చిట్టిబాబు పాల్గొన్నారు.

అవసరానికి మించి భూ సమీకరణ

(మొదటి పేజీ తరువాయి)

పర్యటించి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పెదపరిమిలో 6,513 ఎకరాలు, వడ్డమానులో 1936, హరిశ్చంద్రపురంలో 2428 ఎకరాల పొలాలున్నాయని, వడ్డమాను, పెదపరిమిలో పత్తి, మిర్చి, మినుము, పెసర తదితర పంటలు పండుతున్నాయని, కృష్ణానది తీరంలో ఉన్న హరిశ్చంద్రపురంలో అరటి, కంద, పసుపు లాంటి ఉద్యాన పంటలు కూడా సాగవుతున్నాయని చెప్పారు. అయితే వీటిని రాజధాని నిర్మాణం, రైల్వే లైన్ కోసమంటూ తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, ఇందుకోసం గ్రామ సభలు నిర్వహించినా రైతుల నుండి వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. భూములను ఇష్టారాజ్యంగా ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. 2013 భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి, పోలీసుల్ని అడ్డగోలుగా ఉపయోగించి భూములు లాక్కోవడం ఆపేయాలన్నారు. సన్న, చిన్నకారు రైతుల నుండి అవసరాలకు మించి లక్షల ఎకరాలు సేకరించి కార్పొరేట్లకు కట్టబెట్టి తద్వారా ప్రభుత్వమే భూ వ్యాపారం చేస్తోందని విమర్శించారు. తరతరాలుగా భూమి మీద ఆధారపడిన రైతు, కూలీలను బజారు కీడుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

నేడు విజయవాడలో చర్చా వేదిక

ప్రభుత్వం బలవంతంగా భూమి తీసుకుంటే ఏమి చేయాలి? 2013 చట్టంలో ఏముంది? మన భూమిని ఎలా రక్షించుకోవాలి? పోలీసుల నిర్బంధంపై న్యాయపోరాటం ఎలా చేయాలి? న్యాయస్థానాన్ని ఎలా ఆశ్రయించాలి..? అనే అంశాలను వివరించేందుకు విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు చర్చా వేదికను నిర్వహిస్తున్నట్లు శివనాగరాణి తెలిపారు. రెండో విడత భూ సమీకరణ గ్రామాల్లో ఆందోళన చెందుతున్న రైతులు, కూలీలు, ఇతర పేదలంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. చర్చా వేదికలో హైకోర్టు న్యాయవాదులు సుంకర రాజేంద్రప్రసాద్, సిహెచ్ రవికుమార్, నల్లూరి మాధవరావు, నర్రా శ్రీనివాసరావుతో పాటు రైతుసంఘం పూర్వ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర నాయకులు, భూ చట్టాలపై అనుభవమున్న ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు. హక్కులు తెలుసుకునేందుకు, భూములు కాపాడుకునేందుకు, రైతులు, కూలీలు ఈ సమావేశంలో పాల్గొనాలని కోరారు.

శంకర్ విలాస్ బ్రిడ్జి కూల్చివేత ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామన్నారు. నిర్మాణం ఆపాలని కోర్టు జారీ చేసిన స్టే ఉత్తర్వులను కూడా తొలగింపచేశామన్నారు. ఒకేసారి బ్రిడ్జిని కూల్చకుండా కొంత సమయం తీసుకుని వాహనదారులకు ప్రత్యామ్నాయ మార్గాలపై అవగాహన కల్పించి కూల్చివేత చేపట్టామన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి ఎవ్వరూ ఆటంకం కలిగించొద్దని, షాపుల వారు స్థలాలు అప్పగించాలని కోరారు. మరోవైపు పాత బ్రిడ్జి కూల్చివేత పనులు ప్రారంభం కావడంతో గుంటూరులో వాహనాల రాకపోకలకు పలు మళ్లింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఈస్టు ట్రాఫిక్ సిఐతో కలిసి జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ పలు ప్రాంతాల్లో పర్యటించారు. వాహనదారులు ప్రత్యామ్నాయంగా డొంకరోడ్డు మూడు వంతెనలు, కంకరగుంట ఆర్‌వోబి, అండర్ పాస్, బ్రాడీపేట, లక్ష్మీపురం మార్గాల్లో వెళ్లాలని సిఐ అశోక్‌కుమార్ తెలిపారు. ఎక్కడా ట్రాఫిక్ జామ్ లేకుండా చూస్తామన్నారు.

డెల్టా కాల్వలకు జలకళ

(మొదటి పేజీ తరువాయి)

బ్యాంక్ కెనాల్‌కు1848 క్యూసెక్కులు, హై లెవెల్ ఛానల్‌కు 300, నిజాంపట్నం తూర్పు కాల్వకు 718, పడమటి కాల్వకు 286, పడవల కాల్వకు 461, తుంగభద్ర (మద్రాస్) కాల్వకు 3140 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రధాన కాల్వతో పాటు డెల్టా కాల్వలు నీటి ఉధృతితో నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. దాదాపు 15 రోజుల క్రితం వర్షాల అనంతరం ఎండలు తీవ్రంగా ఉండటంతో వెద పద్ధతిలో వేసిన వరి పొలాలకు, నారు మళ్లు వేసిన భూములకు నీరు అవసరమైంది.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్


మనోహర్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం గుడిపూడి సమీ పంలో చోటు చేసుకుంది. పెదకూరపాడు మండలం మునుగోడు కు చెందిన నేలపాటి మనోహర్ (22) అమరావతి బేకరిలో పని చేస్తున్నాడు. మనోహర్ శనివారం ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లి వస్తుండగా మార్గ మధ్యంలో అదుపుతప్పి రోడ్డు పక్కన బోదకాల్వలో పడి అక్కడికక్కడే మృతి చెం దాడు. మృతుడి తండ్రి చంద్రరావు ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

పట్టణ శివారు ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న పలువురిపై పట్టణ ఎస్ఐ వెంకటరమణ శనివారం కేసులు నమోదు చేశారు. పట్టణ శివారు మేకల మండి, నూత నంగా వేసిన బైపాస్ రోడ్డు సమీపంలో పలువురు గ్రూపులుగా చేరి మద్యం తాగు తున్నట్లు ఎస్ఐ వెంకటరమణకు సమాచారం అందింది. ఎస్ఐ పోలీస్ సిబ్బందితో వెళ్ళి వారిని అదుపులోకి తీసుకొని బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైన బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, మద్యం తాగి వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ప్రజాశక్తి - తెనాలి

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పోలీసు కేసు నమోదు చేశారు. త్రీటౌన్ ఎస్ఐ కరిముల్లా వెల్లడించిన వివరాల ప్రకారం స్థానిక చెంచుపేటకు చెందిన నారాలక్ష్మి (40) భర్త రామ్మోహనరావు మూడు నెలల కిందట అనారోగ్య కారణాలతో మృతి చెం దాడు. ఆయన చేసిన అప్పుల వాళ్ల లక్ష్మికి నోటీసులు పంపి అప్పు చెల్లించాలని ఒత్తిడి చేస్తుండడంతో ఆమె ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు గుంటూరు ప్రయివేటు వైద్య శాలకు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.


దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

బార్లపై ఎక్సైజ్ అధికారుల దాడులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని కొన్ని బార్లలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నారన్న ఆరోపణలపై ఎక్సైజ్ అధికారులు శనివారం పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర డైరక్టర్ ఆదేశాల మేరకు గుంటూరు జెకెసి కళాశాల రోడ్డులోని డిటిసి ఆఫీసు వద్ద ఉన్న ఆపిల్ బార్ అండ్ రెస్టారెంట్‌ను టాస్క్‌ఫోర్సు సిఐ ఎం.యశోదరా దేవి తనిఖీ చేశారు. బార్‌పై కేసు నమోదు చేసి సీజ్ చేశారు. దుకాణాల్లో ఉన్న మద్యంను బార్లలో అమ్మకూడదని, బార్ల వారు ప్రత్యేకంగా నిర్ధేశించిన ధరకు కొనుగోలు చేయాలని అధికారులు తెలిపారు. కొంత మంది అందుకు విరుద్ధంగా దుకాణాల్లో లభ్యమవుతున్న సరుకు తక్కువ ధరకు వస్తుండటం వల్ల వీటిని బార్లలో విక్రయిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేశారు. జిల్లా డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసులు ఆపిల్ బార్ అండ్ రెస్టారెంట్ లైసెన్సును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బార్‌కు అనుబంధంగా ఉన్న మద్యం దుకాణాన్ని కూడా షాపు లైసెన్సును జిల్లా ఎక్సైజ్ అధికారి వి.అరుణకుమారి కూడా సస్పెండ్ చేశారు. ఈమేరకు ఉత్తర్వులు ఇచ్చారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని యువకుడు మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని కామేపల్లి గ్రామ శివారులోని మెడికల్ కళాశాల వద్ద శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెడికల్ కళాశాలలో నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు ఒక వ్యక్తి మెడికల్ కళాశాల సమీపంలోని చెట్టుకి ఉరివేసి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలం వద్దకు పట్టణ ఎస్ఐ మోహన్ వెళ్లి పరిశీలించారు. మృతుని వివరాలు తెలియ రాలేదనీ, మృతిని జేబులో నాలుగు రకాల టాబ్లెట్లు, ఒక పుస్తకం ఉన్నట్లు తెలిపారు. పుస్తకంలోనూ ఎటువంటి వివరాలు లేవని అన్నారు. అనారోగ్య కారణంతో ఉరి వేసుకున్నారా లేక ఇతర కారణాలు ఉన్నాయేమోననే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


మృతుడు

శాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుని వివరాలను తెలుసు కునేం దుకు సోషల్ మీడియాలో మృతుని ఫొటో పెట్టామనీ, ఎవరి కైనా వివరాలు తెలిస్తే సమాచారం అందించాలని వారు తెలియజేశారు.

నిందితులు అరెస్టు ... ఆభరణాలు స్వాధీనం...


సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పీ హనుమంతరావు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

పట్టణంలో పలు దొంగతనాలకు పాల్పడిన దొంగలను అరెస్టు చేసి వారి నుంచి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్న సంఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ డిఎస్పీ హనుమంతరావు పాల్గొని కేసుకు సంబంధించిన వివరాలు తెలిపారు. పట్టణంలో 16వ వార్డుకు చెందిన దావల లక్ష్మణ్, బోయ కాలీనికి చెందిన నలబోతుల వెంకట దురాప్రసాద్, సత్తెనపల్లి గోపాలకృష్ణ చెడు వ్యాసనాలకు బానసలయ్యారు. దొంగతనాలకు పాల్పడుతూ జులాయిగా తిరుగుతున్నారని చెప్పారు. పార్క్‌బజారులో నివాసం ఉంటున్న డి.లక్ష్మీ కాంతమ్మ ఇంటి వద్ద ముద్దాయిలు రెక్కి నిర్వహించారు. బాధితురాలి కుమారుడు బయటకు వెళ్ళటాన్ని గమనించిన ముద్దాయిలు ఒక్కసారిగా ఇంట్లోకి ప్రవేశించి బాధితురాలిపై దాడి చెసి ఆమె మెడలో ఉన్న నాన్తాడు, ఆంజనేయస్వామీ లాకెట్ ఉన్న గొలుసును దొంగిలించి పారిపోయారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసిన సిఐ నాగ మల్లేశ్వరవు తన సిబ్బందితో కలసి ముగ్గురు ముద్దాయిల్లో ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రెండు పేటలున్న బంగారు నాంతాడు, ఆంజనేయస్వామీ లాకెట్‌తో ఉన్న బంగారు చైను స్వాధీనం చేసుకున్నారు. వీటి బరువు 36.030 గ్రాములు వీటి విలువ రూ.3లక్షల 42 వేలు ఉంటుందని ఆయన తెలిపారు. ముద్దాయిలు దావల లక్ష్మణ్, నలబోతుల వెంకట దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. నేరస్తులను సకాలంలో పట్టుకున్న సిబ్బందిని ఆయన అభినందించారు .

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ శోభన్ బాబు

ప్రజాశక్తి - వినుకొండ

చోరీ కేసులో ముగ్గురు దొంగలను పట్టుకొని అరెస్టు చేసినట్లు వినుకొండ పట్టణ సిఐ యు.శోభన్ బాబు తెలిపారు. టౌన్ పోలీస్ స్టేషన్లో శనివారం విలేకరుల సమావేశం నిర్వ హించి ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 31వ తేదీన వినుకొండ మండలం కొత్తపాలెం గ్రామంలో రాయన మస్తాన్ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడి 139 గ్రాముల బంగారు ఆభరణాలు దొంగిలించారని తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. పట్టణ సిఐ శోభన్‌బాబుకు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై సమీర్ బాష, స్వర్ణలత సిబ్బందితో కలిసి గాలింపు చేపట్టారు. ఏనుగుపాలెం రోడ్డులోని మార్కెట్ యార్డులో దొంగలను అదుపులోకి తీసు కున్నట్లు సిఐ తెలిపారు. తెనాలి పట్టణం చెంచుపేటకు చెందిన పెంట్రాల రాఘవులు, చిన్నబ్బాయి, వెంకటేశ్వర్లు ముగ్గురు దొంగలు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. వారి నుంచి ఆభరణాలు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ శోభన్‌బాబు తెలిపారు. దొంగలను చాకచక్యంగా పట్టుకునేందుకు సమర్థవంతంగా విధులు నిర్వహించిన ఎస్సైలు సమీర్ భాష, స్వర్ణలత, పోలీస్ సిబ్బంది తిరుమలరావు, బాల వెంకటేశ్వర్లు, తిరుమల నాయక్, శ్రీనివాసరావును సీఐ అభినందించారు.

నిడమర్రు టిడ్కో గృహాల వద్ద పోలీసుల పల్లెనిద్ర



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు


కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం నిడమర్రు టిడ్కో గృహ సముదా యాలలో మంగళగిరి రూరల్ పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఇటీవల టిడ్కో వద్ద అనేక అసాంఘిక కార్యక్రమాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో పోలీసుల పల్లె నిద్రకు ప్రాధాన్యత ఏర్పడింది. నవ శిశువు ముళ్ళ కంచెలో దొరకడం, బాలికపై అత్యాచార యత్నం, తరచూ వివాదాలు, రోడ్లపైనే వాహనాలు పార్క్ చేసి ఇతరులకు ఇబ్బందులు కలిగించడం వంటి వివాదాస్పద అంశాల నేపథ్యంలో పోలీసులు కొందరికి కౌన్సిలింగ్ కూడా ఇస్తున్నట్లు సమాచారం. పోలీసుల ఈ చర్యపై పలువురు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ప్రత్తిపాడు ఎస్ఐ ఎన్.నరహరి అన్నారు.ప్రత్తిపాడు మండల పరిధిలోని వంగిపురం గ్రామంలో పర్యటించారు. అనంతరం గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని అన్నారు. పాత కేసులు, నేర చరిత్ర ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. గ్రామంలో తల్లితండ్రులు పిల్లలకు బైక్‌లు ఇచ్చి రోడ్డుకి పంపుతున్నారు. మైనర్ తీరకుండా పిల్లలు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసు నమోదు చేయాల్సి ఉంటుంది హెచ్చరించారు. గ్రామంలో సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండి మీరు మీ కుటుంబాలు సంతోషంగా ఉండాలని తెలిపారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

వెంకటేశ్వర్లుకు సిపిఎం నివాళి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సిపిఎం నందిగామ గ్రామ సభ్యులు మేడ వెంకటేశ్వర్లు శనివారం అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న మేడ వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.విజయకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ బి.శివనాగరాణి, సిపిఎం సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, మండల కమిటీ సభ్యులు బి.రామారావు, ఏం.హరిపోతురాజు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



నాగార్జున కొండలో సందడి చేస్తున్న పర్యాటకులు

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి

లాంచీ స్టేషన్ ఆదాయం రూ. 45వేలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

రెండవ శనివారం సెలవుదినం కావటంతో భారీగా ఆంధ్ర- తెలంగాణ రాష్ట్రాల నుంచి పర్యాటకులు నాగార్జున కొండకుకు తరలివచ్చి సందడి చేశారు. పర్యాటకులు కేరింతలు కొడుతూ లాంచీలలో నాగార్జున కొండకు వెళ్లారు. కొండలోని మ్యూజియంలో ఉన్న బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టికుండలు, తొమ్మిది అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధ శాల, స్నానాల గట్టు, బోది వక్షం చూసి తన్మయం చెందారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపి స్టేడియం, అశ్వమేధ యగ్నశాల, శ్రీ రంగనాథ స్వామి దేవాలయం, 60 అడుగుల ఎత్తునుండి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. లాంచీల ద్వారా రూ.45 వేల ఆదాయం పర్యాటక శాఖకు సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు పేర్కొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో యథావిధిగా స్పందన

పల్నాడు కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్పందనలో తమ సమస్యలు పరిష్కారం కోసం అర్జీదారులు దాఖలు చేసినప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోయినా తమ ఫిర్యాదులకు సంబంధించి సమాచారం తెలుసుకోవడానికి 1100 టోల్ ఫ్రీ నెం.కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ పి.అరుణ్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివోవి డాట్ ఇన్) వెబ్సైట్‌లో అర్జీలు నమోదు చేసుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందవచ్చని పేర్కొన్నారు. రేపు కలెక్టరేట్‌లో స్పం దన యథావిధిగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగుతుందని కార్యక్రమంలో అన్ని శాఖ ల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు సమస్యలకు సంబంధించి అర్జీలు అందజేయాలన్నా రు. అర్జీదారులు గత అర్జీలకు సంబంధించిన రశీదు వెంట తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైతే చర వాణికి సందేశం వస్తుందన్నారు. సందేశాలను అర్జీదారులు పరిశీలించాలన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం



సంప్రదాయ నృత్యంలో గిరిజన బాలికలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గుర్రం జాషువా సమావేశ మందిరంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పల్నాడు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు గిరిజన సంఘాల నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సభలో గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ గిరిజన భవన్ నిర్మించాల్సిన ఆవశ్యకతను వివరించారు. గిరిజనులకు ఆధార్ కార్డులు, ఇంటి స్థలాలు మంజూరు చేసి ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్ అరుణ్ బాబును కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన భవన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆధార్ కార్డులు, ఇంటి స్థలాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారిని ఆదేశించారు. భారత ప్రభుత్వం పి.ఎంజన్‌మన్ పథకంలో తొమ్మిది ప్రభుత్వ శాఖల సహకారంతో 11 స్కీమ్‌ల ద్వారా గిరిజనుల (చెంచులు) అభివృద్ధికి అనేక చర్యలు చేపడు తోందన్నారు. ఈ పథకం ద్వారా అన్ని చెంచు గూడెంలలో అర్హులైన వారికి ఇంటి నిర్మాణం, సిసి రోడ్లు, అంగన్వాడీ సెంటర్ ఏర్పాటు, తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. భారత ప్రభుత్వం డిఏ జుగా పథకం ద్వారా గిరిజనుల అభివృద్ధికి 17ప్రభుత్వ శాఖల సహకారంతో 25 రకాల పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పథకం క్రింద జిల్లాలో 5 మండలాలలోని ఏడు గ్రామాల లోని 17 గిరిజన కాలనీలను ఎంపిక చేసి ఇళ్ళు, సిసిరోడ్లు, తాగునీటిసరఫరా, అంగన్‌వాడీ సెంటర్లను ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో 10 వ తరగతిలో 550 కి పైగా మార్కులు సాధించిన గిరిజన విద్యార్థులు బి.సాయితేజ నాయక్, కె.సంపత్ నాయక్‌కు రూ 5వేలు ఆర్థిక సహాయాన్ని కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో వివిధ గిరిజన సంఘ నాయకులు, జిల్లాలోని గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో జిల్లా గిరి జన సంక్షేమ శాఖ అధికారిని జోత్స్న, గిరిజన సంఘ నాయకులు కోటా నాయక్, పాండు నాయక్, విష్ణు నాయక్, మేడా పోతురాజు, శ్రీరావుల కొండలు, కె.దాసు పాల్గొన్నారు.



గిరిజన బాలబాలికలతో కలెక్టర్



గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరవింద్‌బాబు

క్రమశిక్షణతోనే తల్లిదండ్రుల చెమట చుక్కలకు విలువ

'రక్షక భటులతో రక్షాబంధన్' కార్యక్రమంలో డిఎస్‌పి హనుమంతరావు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

విద్యార్థుల క్రమశిక్షణతోనే తల్లిదండ్రుల చెమట చుక్కలు విలువ వస్తుందని సత్తెనపల్లి డిఎస్‌పి ఎం.హను మంతరావు అన్నారు. శనివారం రక్షాబంధన్ కార్యక్రమం సత్తెనపల్లి పట్టణం నరసరావుపేట రోడ్డులోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహములో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమంతరావు విచ్చేశారు. ముందుగా వసతి గృహ ప్రాంగణంలో కొబ్బరి మొక్కలను డిఎస్పి నాటారు. అనం తరం హాస్టల్ విద్యార్థినిలతో సమావేశ మయ్యారు. వసతి గృహ సంక్షేమ అధికారి పాలెపోగు సుమణి డిఎస్పి హనుమంతరావుకు రాఖీకట్టి కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. అనంతరం విద్యార్థులు రాఖీలు కట్టారు. డిఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం క్రమశిక్షణతో శ్రమి స్తేనే విజయం సాధ్యమవుతుందని తద్వారా తల్లిదండ్రుల చెమట చుక్కలకు విలువ వస్తుందని అన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్‌తో ఎక్కువ సమయాన్ని వృథా చేస్తున్నారనీ, తద్వారా జీవితం అంధకారం అవుతోందని తెలిపారు. కొన్ని దురాలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఆకాం క్షించారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల శ్రమను దృష్టిలో ఉంచుకొని తమ అడుగులు వేయాలని సూచించారు. విద్యార్థులు చదువు మీదనే దృష్టి ఉంచాలనీ, మీ రక్షణను పోలీసులు చూసుకుంటారని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రక్షాబంధన్ రోజున వసతి గృహాన్ని సందర్శిం చడం తనకు ఎంతో ఆనందంగా ఉందనీ, తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు. వచ్చిన ఆరునెలల్లోనే వసతి గృహంలో అనూహ్యమైన మార్పులు తీసుకొచ్చినందుకు వార్డెన్ సుమణిని డీఎస్పీ అభినందించారు. అయితే మేదరమెట్ల హనుమంతరావు ఎక్కడ పని చేస్తే అక్కడ పేద విద్యార్థుల వసతి గృహాన్ని దత్తత తీసుకొని వారికి కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేస్తుంటారు. అనంతరం పట్టణ సిఐ నాగమల్లేశ్వర రావు, మహిళా ఎస్సై యాసిన్ మాట్లా డుతూ ఏ ఆపద వచ్చినా పోలీసులు ఉన్నారన్న సంగతి గుర్తుంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మదర్ థెరీసా స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్ చిలకా జాన్సన్ మాట్లాడుతూ వసతి గృహ సుందరీకరణకు తమ సంస్థ ద్వారా మొక్కలను ఉచితంగా అందిస్తామని అన్నారు. హెల్ప్ ఫౌండేషన్ ఛైర్మన్ కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు తమ సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి హనుమంతరావు

రాష్ట్ర స్థాయి పోటీలకు వశిష్ట కళాశాల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడాప్రాంగణంలో డిఎస్‌డిఓ నరసింహా రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి శనివారం వరకు రెండు రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి ఆటల అండర్-22 బాల, బాలికల కబడ్డీ, వాలీబాల్ పోటీలలో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని వశిష్ట జూనియర్ కళాశాల ఛైర్మన్ మద్దుల కోటేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలకు పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు కళాశాలల నుండి విద్యార్థులు హాజరుకాగా హోరాహోరీగా జరిగిన పోటీలో తమ విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవ్వడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో బాలికల విభాగంలో ప్రతిభ చాటిన డి.శ్రావణి, ఎన్. శ్రావణి, ఏ.అక్షయ, బాలుర విభాగంలో ప్రతిభ చాటిన వెంకట సాయి, ఏ.జయప్రకాష్, ఏ.రవిబాబు, వాలీబాల్ పోటీలలో బాలుర విభాగంలో కె.సాగర్, బాలికల విభాగంలో ఎన్. దీపికను అభినందిం చారు. కళాశాల డైరెక్టర్ మద్దుల నరేష్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు విద్యతో పాటు ఆటలకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఈ నేపథ్యంలోనే తమ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభచాటి త్వరలో ఆచార్య నాగా ర్జున యూనివర్సిటీలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలో కూడా ప్రతిభ చాటి పల్నాడు జిల్లాకు, కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు గడించాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొ న్నారు. కళాశాల వైఎస్ ఛైర్మన్ నర్రా శేషగిరి, డైరెక్టర్లు బావిరిశెట్టి మదన రాజారావు, నల్లపాటి శ్రీకాంత్, ఫిజికల్ డైరెక్టర్ వై.సురేష్, ప్రిన్సిపల్ శివ నాగేశ్వరరావు, అధ్యాప కులు, అధ్యాపకేతర సిబ్బంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

14న ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయండి

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

అన్నదాత సుఖీభవ పథకాన్ని సమగ్రంగా అమలుపర్చి నిధులు కేటాయించిన సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలుపుతూ మాచర్ల నియోజకవర్గ రైతులతో భారీ ట్రాక్టర్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 14న ఉదయం 10 గంటలకు రాయవరం జంక్షన్ నుంచి మాచర్ల వ్యవసాయ మార్కెట్ వరకు ఈ ట్రాక్టర్ ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని రైతులు, మహిళా రైతులు, పెద్దసంఖ్యలో ట్రాక్టర్లతో తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - నాదెండ్ల

మండల కేంద్రమైన నాదెండ్లలోని శ్రీగంగా పార్వతి సమేత మూలస్థానేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబి రాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామానికి చెందిన డాక్టర్ నల్లమోతు ప్రవీణ్ తెలిపారు. తనతో పాటు న్యూరాలిజిస్ట్ డాక్టర్ మెడబలిమి సౌమ్య ఉచిత వైద్య పరీక్షలు చేస్తారన్నారు. మందులు పంపిణీతో పాటు అవసరమైన రోగులకు వైద్య చికిత్సలు చేయిస్తామని ఆయన వెల్లడించారు. నాదెండ్ల పరిసర ప్రాంత ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్

గ్రామాలకు బస్సులేవీ..

- మంగళగిరి నుండి గుంటూరుకు సర్వీసులు తక్కువ..
- ప్రయాణికుల రద్దీ ఎక్కువ..

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఆర్టీసీ డిపో నుంచి కొన్ని గ్రామాలకు నేటికి బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీం దగ్గరలోని గుంటూరుకు కూడా తగినన్ని బస్సులు నడవడం లేదు. దీంతో ప్రయాణికుల రద్దీ ఎక్కువ అయి అనేక ఇబ్బందులు పడుతున్నారు. మంగళగిరి ఆర్టీసీ డిపో 1990 సంవత్సరంలో ఏర్పడింది. 96 బస్సులతో ఈ డిపో నుండి మంగళగిరి నియోజకవర్గం, వివిధ మండలాలకు, హైదరాబాద్, విశాఖపట్నం, శ్రీశైలం, తదితర ప్రాంతాలకు బస్సులు నడిచేవి. మరి ముఖ్యంగా మంగళగిరి నుండి అమరావతి, తుళ్లూరు, దుగ్గిరాల మండలం పెద్దపాలెం, ఈమని, చిలువూరు, తాడేపల్లి, చిర్రావూరు, శృంగారపురం, తాడికొండ, తదితర ప్రాంతాలకు బస్ సర్వీసులు నడిచేవి. రాను రాను బస్ సర్వీసులు తగ్గిపోతూవస్తున్నాయి. ప్రస్తుతం 36 సర్వీస్ లు మాత్రమే నడుస్తున్నాయి. వాటిల్లో ఎక్కువ భాగం విజయవాడ నుండి గుంటూరు బైపాస్‌కు 9 బస్సులు, మంగళగిరి నుండి గుంటూరుకు 7 బస్సులు, మంగళగిరి నుండి తెనాలికి 6 బస్సులు, సచివాలయానికి రెండు బస్సులు, శ్రీశైలానికి ఆరు బస్సులు నడుస్తున్నాయి. హైదరాబాదు బస్ సర్వీస్ నిలిపివేశారు. డొంక రోడ్లు ఉన్న సమయంలో కూడా మంగళగిరి నుండి అమరావతికి బస్సులు నడిచేవి. గంటకు ఒక బస్సు నడిచేది. మంగళగిరి నుండి గుంటూరు కు ఏడు బస్ సర్వీస్‌లో ఉన్న సమయపాలన పాటించక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్కసారి గంటకు పైగా ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సు మంగళగిరి నుండి గుంటూరుకు రావడంలేదని విమర్శలు ఉన్నాయి. అమరావతి రాజధాని ఏర్పడిన తర్వాత రాజధాని గ్రామాలకు అసలు బస్సులే మంగళగిరి డిపో నుండి లేవు. గతంలో మంగళగిరి నుండి తుళ్లూరు వయా వెంకటపాలెం మీదుగా బస్ సర్వీసులు నడిచేవి. ప్రత్యేకంగా అయినవోలు, నేలపాడు, వెంకటపాలెం గ్రామాలకు బస్సులు నడిచేవి. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఈనెల 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. బస్సులు గ్రామీణ ప్రాంతాలకు లేకుండా ఉచితంగా మహిళలకు బస్సు సౌకర్యం కల్పించిన బస్సు లేకపోతే ఉపయోగం ఏమి ఉంటుందని ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు. అదేవిధంగా దుగ్గిరాల మండలానికి ఉన్న సర్వీస్లన్నీ రద్దు చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే మంగళగిరి నుండి తెనాలి, గుంటూరు, బైపాస్ రోడ్‌లో విజయవాడ గుంటూరు సర్వీస్ లు మాత్రమే నడుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు బస్ సర్వీసులు లేవు. దీనివలన గ్రామీణ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం లేకుండా పోతుంది. గ్రామీణ ప్రాంతాలకు, రాజధాని గ్రామాలకు సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. హైదరాబాద్ బస్సు సర్వీసులు లేకపోవడం వలన ఈ ప్రాంత ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేదు : డిపో మేనేజర్ పిచ్చయ్య

ఆర్టీసీ మంగళగిరి డిపో మేనేజర్ కె.పిచ్చయ్య మాట్లాడుతూ మంగళగిరి డిపోలో 36 బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేదని అన్నారు. అయితే ప్రజల కోరితే ఆలోచించవచ్చునని అంటున్నారు. మంగళగిరి నుండి అమరావతి ప్రాంతాలకు బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని ఇటీవల ప్రయాణికుల నుండి డిమాండ్ వచ్చిందని అన్నారు. దీనిపై ఆలోచిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా మంగళగిరి డిపోకు 50 ఎలక్ట్రికల్ బస్ సర్వీసులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ బస్సులు వస్తే అన్ని ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించవచ్చునని అన్నారు.



పుస్తకావిష్కరణలో పెనుగొండ లక్ష్మీనారాయణ, స్వరూప రాణి తదితరులు

స్త్రీవాద సాహిత్యంలో దిట్ట స్వరూప రాణి

ప్రజాశక్తి - తెనాలి

స్త్రీవాదం, పురుషాధిక్య వ్యతిరేక భావజాలం, దళిత సాహిత్యం స్వరూప రాణి రచనల్లో ధ్వనిస్తాయని అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూప రాణి రచించిన అల్లిక పుస్తక పరిచయ సభ శనివారం రాత్రి స్థానిక కవి రాజ పార్కులోని విజికె భవన్‌లో జరిగింది. కనపర్తి బెన్హర్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పెనుగొండ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి దళిత స్త్రీవాద కవయిత్రిగా స్వరూప రాణి గుర్తింపు పొందారని కొనియాడారు. స్వరూప రాణి రచనాశైలిని వివరించారు. రచయిత స్వరూప రాణి మాట్లాడుతూ తన రచనల్లో స్త్రీవాద సాహిత్యం అధికంగా ఉంటుందని చెప్పారు. అల్లిక పుస్తక నేపథ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షులు చెరుకుమల్లి సింగారావు, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

మలినేని కాలేజీలో కొనసాగుతున్న అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి - గుంటూరు

పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థినులకు మూడవరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మోటివేషనల్ స్పీకర్ అయ్యప్ప పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థినులందరూ ధైర్యంతో మెలుగుతూ వారి వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకుంటూ, సమాజంలో రాణించాలని తద్వారా ఉన్నత శిఖరాలను చేరుకోవాలని తెలిపారు. తర్వాత సెషన్‌లో స్టేట్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుధాకర్, శంకర నేత్రాలయ వైద్యులు డాక్టర్ తనిమ పాల్గన్నారు. డాక్టర్ సుధాకర్ విద్యార్థులను ఉద్దేశించి ప్రకఅతిని మనం రక్షించుకుంటే ప్రకఅతి మనకు అన్నీ ఇస్తుందని అన్నారు. తనిమా కంటికి ఏవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ పేరుమాళ్లు, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కిషోర్‌బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ జెట్టి అప్పారావు, ఎస్ ఎండ్ హెచ్ విభాగాధిపతి డాక్టర్ శ్రీకృష్ణచైతన్య పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. శనివారం బ్రాడీపేటలోని శారదా నికేతన్‌లో కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా సి.జె.మణికుమార్, అధ్యక్షులుగా ఆవుల తిరుమలేష్, జనరల్ సెక్రెటరీగా బి.సత్యం, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా షేక్.జిలానీభాషా, ట్రెజరర్‌గా పుట్టా అప్పారావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా గుత్తా శ్రీనివాసరావు, జె.కమలప్రసాద్, ఎం.ఏడుకొండలు, మహిళా ప్రతినిధిగా జోస్‌మేరి ఎన్నికయ్యారు. అలాగే తెనాలి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. రెడ్డి శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా, పి.వి.రమణ, వి.శ్రీనివాసరావు ఎన్నికల పరిశీలకులుగా హాజరయ్యారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు.


పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - గుంటూరు

ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా జై ఏకలవ్య అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక అమరావతి రోడ్డులోని నగరాలు ప్రధాన వీధిలోని ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ హాస్పిటల్ అండ్ ల్యాబ్స్ జనరల్ మల్టీ స్పెషాలిటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ నూకతోటి బాలాజీ ప్రారంభించారు. శిబిరంలో ప్రభుత్వ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బుచ్చిబాబు, జనరల్ ఫిజీషియన్ ఎం.ఆదంఖాన్, డాక్టర్ దామర్ల ఆషా తదితర వైద్యులతో సాధారణ వైద్య సేవలతో పాటు గర్భిణులకు పరీక్షలు, షుగర్, బిపి, థైరాయిడ్, గుండె, దంత, చర్మ, ఎముకల వైద్య నిపుణులు ఉచిత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సంఘం అధ్యక్షులు మేడా లక్ష్మయ్య మాట్లాడుతూ దశాబ్దాలుగా విద్య, రాజకీయ, సామాజిక రంగాలలో వెనుకబడి ఉన్న ఏరుకుల జాతి సమాజాభివృద్ధికి ఏకలవ్యుని స్ఫూర్తితో కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు మేడా హనుమంతరావు, ఉపాధ్యక్షులు ఉయ్యాల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి టి.పాపారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ టి.రామకృష్ణ పాల్గొన్నారు.

బేతపూడిలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ'

ప్రజాశక్తి - ఫిరంగిపురం

స్థానిక మండలంలోని బేతపూడి గ్రామంలో జరిగిన బాబు షఉ్యరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం శనివారం జరిగింది. మండల నాయకులు, మైనారిటీ విభాగం మస్తాన్ వలి మండల బూత్ కన్వీనర్ ప్రవీణ్ రెడ్డి మండల ఎస్ సీ సెల్ సాల్మన్ సయ్యద్ సైదులు చెవూరి రామ్మోహన్ రెడ్డి సురేష్ గ్రామ వైసీపీ నాయకులు షరీఫ్ జుబేర్ చిన్న సుభాని ఖజావలి యర్రసాని నాగేశ్వరరావు మస్తాన్ వలి మల్లేశ్వర రావు దాసు ఎంపిటిసి ఖాసిం షహిద్‌లు పాల్గొని ప్రతి గడపకి తిరిగి బాబు గారు చేసిన మోసాన్ని వివరించారు.

ట్రాఫిక్ నియంత్రణకు విద్యా సంస్థలు సహకరించాలి

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు నగరపాలకసంస్థ పరిధిలోని ప్రతిష్టాత్మకమైన శంకర్ విలాస్ వంతెన నిర్మాణం దృష్ట్యా పూర్తిస్థాయిలో రాకపోకలు నిలిపివేయడం జరిగిందని, నగరంలోని విద్యా సంస్థలు కూడా ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శనివారం జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరంలో విద్యాసంస్థల ప్రతినిధులు, స్కూల్, కాలేజి విద్య అధికారులు, జిఎంసి, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది.కమిషనర్ మాట్లాడుతూ ఉదయం8:30 నుండి సాయంత్రం 4 గంటల వరకు, ఉదయం 9:15 నుండి 4:45 గంటల వరకు షిఫ్ట్‌లుగా విద్యా సంస్థలు టైమింగ్స్ మార్చుకొని సహకరించాలని కోరారు. శనివారం నుండి వంతెన తొలగింపు పనులు ప్రారంభయ్యాయన్నారు. ప్రత్యామ్నాయ రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా నగరంలోని విద్యా సంస్థలను స్కూల్, ఇంటర్ కేటగిరీలుగా పరిగణలోకి తీసుకొని ఏ, బి షిఫ్ట్‌లుగా వర్కింగ్ టైమింగ్స్ మార్చుకోవాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికే ట్రాఫిక్ నియంత్రణకు సూచించిన మార్గాల్లో ఆక్రమణలు తొలగించామన్నారు. ప్రస్తుతం ఏ, బి షిఫ్ట్‌లుగా విద్యా సంస్థల టైమింగ్ మార్పుచేసి ప్రొసీడింగ్స్ ఇస్తామన్నారు. కొన్ని రోజుల తర్వాత ఏమైనా సమస్యలు గుర్తిస్తే మార్పులు చేసుకుందామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్

విద్యాసంస్థల్లో హర్‌ఘర్ తిరంగా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాలు విద్యాసంస్థల్లో చేపట్టేందుకు ముందుకు రావాలన్నారు. హర్ ఘర్ తిరంగా థీంపై పెయింటింగ్స్, వ్యాసరచన, వక్తఅత్వం, రంగోలి పోటీలు నిర్వహించాలన్నారు. ప్రతి స్కూల్లో హర్‌ఘర్ తిరంగా సేల్ఫీ పాయింట్స్‌ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో ప్లాస్టిక్ రహిత జెండాలను అన్ని విద్యా సంస్థలు, ఇళ్లపై ఎగురవేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, సిటి ప్లానర్ రాంబాబు, ఇంచార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ అశోక్ కుమార్, మేనేజర్ బాలాజీ బాష, విద్యాశాఖ అధికారులు, విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మిషన్ గ్రీన్ గుంటూరులో ప్రజల భాగస్వామ్యం

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మిషన్‌గ్రీన్ గుంటూరు ద్వారా పచ్చని పర్యావరణహితనగరంగా గుంటూరు రూపుదిద్దుకుంటుందని, కాలనీల, అపార్ట్మెంట్ అసోసియేషన్లు తమ ప్రాంతాల్లో మొక్కలు నాటి సంరక్షించుకోవాడానికి ముందుకు రావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శనివారం గోరంట్ల కొండరామ నగర్‌లో ఓనర్స్ వెల్ఫేర్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో 300 మొక్కలు నాటే కార్యక్రమంలో కమిషనర్ పాల్గన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మిషన్‌గ్రీన్ గుంటూరులో భాగంగా ఈ సీజన్లో నగరంలో దశల వారీగా 5 లక్షల మొక్కలు నాటేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే ప్రజా ప్రతినిధులను, జిఎంసి అధికారులు, సచివాలయ కార్యదర్శులను, స్థానిక ప్రజలు, వివిధ స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేస్తున్నామన్నారు. నగరంలోని ప్రజలు అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. కోదండరామ నగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తమ ప్రాంతంలో మొక్కలు నాటడానికి భాధ్యత తీసుకోవడం అభినందనీయమని తెలిపారు.కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.నరసింహారావు, జనరల్ సెక్రెటరీ బి.హనోక్, బి.గోపికృష్ణ, ఏ.సుందర్రావు తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న నగర కమిషనర్



గిరి ప్రదక్షిణలో ఎమ్మెల్యే అరవిందబాబు, ఇతరులు

కోటప్పకొండ గిరిప్రదక్షిణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాఖీ పౌర్ణమి (శ్రావణ పౌర్ణమి) సందర్భంగా శ్రీ త్రికోటేశ్వర స్వామి కొలువైన కోటప్పకొండ గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ చదలవాడ అరవిందబాబు కొండ చుట్టూ ఉన్న గిరి ప్రదక్షిణ రోడ్డుపై నడిచారు. ఆయనతో పాటు వందల సంఖ్యలో భక్తులు, కూటమి నాయకులు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి వేడుకను కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో ఇంతటి వైభవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ గిరి ప్రదక్షిణ ద్వారా భక్తులందరూ ఆధ్యాత్మిక శాంతిని, శ్రీ త్రికోటేశ్వర స్వామి ఆశీస్సులను పొందారన్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం త్రికోటేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



మాస్టీన్‌పేట కాలనీలో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ

మత్తు పదార్థాలతో నష్టాలపై అవగాహన

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

మత్తు పదార్థాల వినియోగం వల్ల మానవ శరీరంలోని అన్ని వ్యవస్థలు దెబ్బతింటాయని సత్తెనపల్లి ప్రోహిబిషన్ ఎక్సైజ్ సీఐ పి.విజయ్‌కుమార్ అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని మాస్టీన్‌పేట కాలనీలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో శని వారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 20సంత్సరాల వరకు శిక్ష పడే అవకాశం ఉందని చెప్పారు. యువత, విద్యార్థులు మద్యానికి ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తల్లి దండ్రులు, టీచర్స్ చెప్పే మంచి విషయాలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ నాగలక్ష్మి పాల్గొన్నారు.



ఏజిపి గంగుల శ్రీనివాసరావును సన్మానిస్తున్న నాయకులు

ఎజిపి గంగుల శ్రీనివాసరావుకు సత్కారం

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల కోర్టుకు నూతన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన న్యాయవాది గంగుల శ్రీనివాసరావును శనివారం దళిత బహుజన ప్రజా సంఘాల నాయకులు సత్కరించారు. పట్టణంలోని న్యాయవాది గంగుల శ్రీనివాసరావు కార్యాలయంలో శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం గంగుల శ్రీనివాసరావు సేవలను గుర్తించి మాచర్ల కోర్టు అసిస్టెంట్ ప్లీడర్‌గా నియమించటం పట్ల సంతోషంగా ఉందని, భవి ష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. మెరుగైన సేవలు అందించి పేరు తెచ్చుకోవా లని కోరారు. కార్యక్రమంలో దళిత బహుజన భీమ్ సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జార్జి, నాయకులు గురజాల అప్పారావు, యరసాని జక్రయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణంలో నర్సిరెడ్డిది కీలకపాత్ర

యన్నం వెంకటనర్సిరెడ్డి అభినందన సభ, సంచిక ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు



సంచికను ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, అతిథులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గుంటూరు నగరంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణానికి నాడు ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా వ్యవహరించిన యన్నం వెంకట నర్సిరెడ్డి కీలక భూమిక పోషించారని మాజీ శాసన మండలి సభ్యులు కె.ఎస్ లక్ష్మణరావు అన్నారు. శనివారం నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో బహుముఖ ప్రజ్ఞాశాలి యన్నం వెంకటనర్సిరెడ్డి అభినందన సంచిక ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన కె.ఎస్ మాట్లాడుతూ నర్సిరెడ్డి గొప్ప సాహితీ వేత్త అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా గ్రంథాలయాల విస్తరణకు నర్సిరెడ్డి ఎంతో కృషి చేశారని కొని యాడారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని యువత, విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శించి విజ్ఞానం పెంపొందించుకోవాలనే నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశారన్నారు. వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ యన్నం వెంకట నర్సిరెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గా, పిసిసి మెంబర్ గా, పొగాకు బోర్డు సభ్యునిగా ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలకు ఎన్నో విధాలుగా సేవలు అందించారన్నారు. 35ఏళ్ల పాటు ఉప్పలపాడు గ్రామసర్పంచ్‌గా కుల, మత పార్టీలకతీతంగా సేవలు అందించి గ్రామాభివృద్ధిలో చెరగని ముద్రవేశా రన్నారు. కార్యక్రమంలో పొన్నపాటి ఈశ్వరరెడ్డి, శనివారపు రామాంజనేయరెడ్డి (ఐటీసీ రెడ్డి), వైసీపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా ఏపీ పోలీసింగ్: చీఫ్‌విప్ జీవీ

ప్రజాశక్తి - వినుకొండ



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో దేశానికే ఆంధ్రప్రదేశ్ పోలీసింగ్ ఆదర్శంగా నిలిచిందని, ఇండియా జస్టిస్ రిపోర్ట్‌లో వెల్లడించిన వివరాలు, ర్యాంకులే అందుకు సాక్ష్యమని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కూడా గడవకముందే, చట్టాలఅమలు, శాంతి భద్రతల పునరుద్ధరణలో సాధించిన పురోగతిని ఆ నివేదిక కళ్లకు కట్టిందన్నారు. సత్వర న్యాయం, పటిష్ట పోలీసింగ్, ప్రజలకు న్యాయ సహాయం వంటి సూచీలలో అగ్రస్థానాలు సాధించడం, ప్రజలకు కొత్త భరోసా కలిగించిందని అన్నారు. శనివారం ఈ మేర కు ఆయన ఒక పత్రికాప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగానే విపక్ష వైకాపా, జగన్‌రెడ్డి చేస్తున్న విమర్శలకూ ఈ నివేదిక అద్దంలాంటి సమాధానమని చురకలు వేశారు. కేవలం ఏడాది వ్యవధిలోనే రాష్ట్రం చట్ట పాలనలో 6.32 స్కోర్ సాధించి దేశంలో రెండో స్థానంలో నిలవడం జగన్ లాంటి అరాచకశక్తులకు అర్థం అవుతుందో లేదోనని కూడా చురకలు వేశారు. ఇండియా జస్టిస్ నివేదికలో6.78 పాయింట్లతో కర్ణాటక మాత్రమే ఏపీ కన్నా పై ర్యాంక్ సాధించిందని, తెలంగాణ, కేరళ, తమిళనాడు తదుపరి స్థానాల్లో ఉన్నాయని రిపోర్ట్ తెలిపిందని వివరించారు. చంద్ర బాబు పాలనతో ప్రతి పౌరుడు సురక్షిత భావనతో జీవిస్తున్నారని అన్నారు. పోలీ సింగ్‌లో కొత్త టెక్నాలజీ వినియోగం, సీసీ కెమెరా నెట్‌వర్క్ విస్తరణ, డ్రోన్ పర్యవేక్షణ, క్రైమ్ అనాలిటిక్స్ యూనిట్ల ఏర్పాటు వంటి చర్యలు ఏపీని దేశంలో టాప్ స్థాయికి చేర్చాయని తెలిపారు. నేరాలపై త్వరిత స్పందన, ప్రజల ఫిర్యాదులపై తక్షణ చర్య, పోలీసు-ప్రజా సంబంధాల మెరుగుదల వంటి అంశాలు రిపోర్ట్‌లో ప్రశంసలు అందుకున్నాయన్నారు. ఉచిత న్యాయ సహాయం అందించడంలో ఏపీ దేశంలోనే ప్రథమస్థానంలో నిలవడం, పేదలు, వెనుకబడిన వర్గాలకి న్యాయం అందించడంలో ప్రభుత్వ కట్టుబాటును చూపిస్తున్నదని జీవీ ఆంజనేయులు చెప్పారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని ఈరిపోర్ట్ మరింత బలపరుస్తోందని పేర్కొన్నారు.



వృద్ధురాలికి అద్దాలు అందజేస్తున్న డాక్టర్ కోడెల శివరాం

489 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

డాక్టర్ కోడెల శివప్రసాదరావుచారిటబుల్ ట్రస్ట్-శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నరసరావుపేట పట్టణం కోట సెంటర్ డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు హాస్పిటల్‌లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరాం ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ రుతుజా, డాక్టర్ ప్రియాంక పాల్గొని 489 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 236 మందికి ఆపరేషన్ అవసరమైనట్లు గుర్తించారు. గతంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో అపరేషన్లు చేయించిన వారికి డాక్టర్ కోడెల శివరామకష్ణ ఉచితంగా కళ్ళజోళ్ళను అందజేశారు. శిబిరానికి హాజరైన వారికి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, కోడెల అభిమానులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - అమరావతి

జన చైతన్య సమితి ఆధ్వర్యంలో పెదకూరపాడు మండలంలోని 75 తాళ్లూరు గ్రామానికి చెందిన బెజ్జం నాగేశ్వరరావు సహకారంతో అమరావతిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వివిధ వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన గర్భిణీలకు శనివారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్టేట్ ఆడిట్ డిపార్టుమెంట్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ గర్భిణీలు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు బలంగా, ఆరోగ్యవంతంగా జన్మిస్తారని, ఆరోగ్యవంతమైన భావిపౌరులను అందించే బాధ్యత మీపై ఉందని అన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం సూపర్డెంట్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ స్త్రీ గర్భం దాల్చిన నాటి నుంచి డెలివరీ అయ్యేవరకు వైద్యుల సూచనలను పాటించాలని అన్నారు. జన చైతన్య సమితి ప్రతినిధులు ప్రతి నెల 9వ తేదీన గర్భిణీలకు క్రమం తప్పకుండా బలమైన పౌష్టికాహారాన్ని అందించడం అభినందనీయమని అన్నారు. రోజూ పాలు, ఆకుకూరలు తప్పక తీసుకోవాలనీ, పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. జనచైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు మాట్లాడుతూ సృష్టిలో మాతృత్వానికి మించిన మాధుర్యం మరోటి లేదని అన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ బొబ్బల సౌజన్య, జనచైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్, బెజ్జం నాగేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.మహేశ్వరి పాల్గొన్నారు. అనంతరం గర్భిణీలకు పెరుగన్నం, కోడిగుడ్లు, డ్రైఫ్రూట్స్ లడ్డులు, రాగి జావా, బెల్లం శనగవిత్తనాలతో తయారు చేసిన చెక్కలు, డ్రాగన్ ఫ్రూట్స్, బత్తాయి కాయలు పంపిణీ చేశారు.



పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ సౌజన్య



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఇతరులు

షూటింగ్ ట్రయల్స్‌కు ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం కోటప్పకొండ రోడ్డులోని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు ఎన్‌సిసి ఆర్మీవింగ్ క్యాడెట్లు ఇంటర్ డైరెక్టరేట్ షూటింగ్ సెలెక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఈనెల 10 నుంచి 29 వరకు కాకినాడలో చేపట్టే ఈ సెలక్షన్ ట్రయల్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సిసి డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారన్నారు. కళాశాల ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్‌బాబు మాట్లాడుతూ తమ కళాశాల నుండి జూనియర్ అండర్ ఆఫీసర్ పి.గీతా సాయి శ్రీవల్లి, బి. కిషోర్‌బాబు, పి.లిఖిత నందిని ఉత్తమ ప్రతిభ కనపరచి రెండు తెలుగు రాష్ట్రాల సెలెక్షన్స్‌కు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్, విభాగాధిపతులు డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ వెంకటరావు, క్యాడెట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడిఏ శ్యాంసుందర్ రెడ్డి

సుస్థిర వ్యవసాయంతో ఆర్థిక పరిపుష్టి

ప్రజాశక్తి - పెదకూరపాడు

సుస్థిర వ్యవసాయంతో రైతులు ఆర్థిక పరిపుష్టి సాధించ వచ్చని రిటైర్డ్ ఏడిఏ బి.శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. మండలంలోని 75త్యాళ్ళూరులో శనివారం నీలగిరి ఫౌండేషన్ వారు మిర్చిపంట-సుస్థిర వ్యవసాయం పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులనుద్దేశించి మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతలు ఉన్నపుడు సూక్ష్మపోషకాలు పని చేయవని, ప్రతి ఏడాది ఒకే ప్రదేశంలో మిర్చి నారుమళ్ళు నాటరాదనీ, ఎత్తు నారుమళ్లు మంచిదనీ, నర్సరీ పద్ధతిలో మిర్చినారు పెంపకం గురించి వివరిం చారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్ రత్తయ్య మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించడం గురించి వివరించారు. వ్యవసాయంలో విత్తనం, మొక్కనాటడం, కలుపు తీయడం, కాయకోయడం, తాలు ఏరటం వరకు మహిళల పాత్ర ఎక్కువనీ, వ్యవసాయ శిక్షణ కార్యక్రమాల్లో కూడా వారు పాల్గొనాలని తెలిపారు. పచ్చిరొట్ట సాగు ఉపయోగాలు, మోంట్ర ఎలెక్ట్రిక్ ట్రాక్టర్ గురించి డియం మారుతీ వివరించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.



అన్నప్ప దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ

అన్నప్ప సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి పెదకూరపాడు

హ్యాండ్లూమ్, టెక్స్టైల్స్ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ అవ్వారి చిన్న అన్నప్ప సేవలు ప్రస్తుత సమాజానికి ఆదర్శనీయమని భావన రుషి దేవాలయ కమిటీ అధ్యక్షులు అనుముల వెంకట్రావు అన్నారు. శనివారం అన్నప్ప మండలంలోని లగడపాడు గ్రామంలోని భద్రావతి సమేత భావన ఋషి దేవాలయ నిర్మాణాన్ని పరిశీలించారు. అన్నప్ప దంపతులను ఆలయ కమిటీ సత్కరించారు. వెంకట్రావు మాట్లాడుతూ మండలంలో పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం సహాయం అందించిన వ్యక్తి చిన్న అన్నప్ప అన్నారు. దేవాలయాలకు కూడా పెద్ద ఎత్తున భూవిరాళాలు అందించారన్నారు. అటువంటి వ్యక్తిని యువత ఎన్నారైలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అవ్వారి రవీంద్రనాథ్ ఠాగూర్, చిల్లాపల్లి సత్యం, నాగరాజు, పెద్ద వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



రోటరీ సేవలను వివరిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న రోటరీ సభ్యులు

రోటరీ సభ్యుల అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో రోటరీ మెంబర్షిప్ డెసిగ్నేటెడ్ డే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. రోటరీ అధ్యక్షులు నల్లూరి శ్రీనివాసరావు అధ్యక్షతన లక్ష్మీటాకీస్ రోడ్డు, గంగానమ్మపేట, టు టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో శనివారం ర్యాలీ నిర్వహించి తమ క్లబ్ లో మెంబర్లుగా చేరమని అవగాహన కల్పించారు. రోటరీ చేసే సేవా కార్యక్రమాల్లో ప్రపంచ వ్యాప్తంగా పోలియో మహమ్మరిని పారదోలాలని, మాహిళ స్వావలంబన కోసం కుట్టు మిషన్లు, చేతివృత్తులకు అవసరమయ్యే పరికరాలు పంపిణీ, విద్యార్థులకు సైకిళ్ళు అందించడంతో పాటుగా క్యాన్సర్పై రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఈదర పూర్ణచంద్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుమ్మడి వెంకటనారాయణ కోశాధికారి వెంపటి హరిప్రసాద్ మెంబర్షిప్ చైర్ మల్లాది అర్జున్, కన్నెగంటి మురళి కృష్ణ, వీరవల్లి మురళి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌కు రాఖీ కట్టిన మహిళలు

వైసిపి కార్యాలయంలో రాఖీ వేడుకలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రాఖీ పౌర్ణమి సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళలు సందడి చేశారు. శనివారం స్థానిక వైఎస్సార్సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ను కలిసిన మహిళ కార్యకర్తలు రాఖీ కట్టి తమ సోదరి భావాన్ని వ్యక్తం చేశారు. జడ్పిటిసి పిల్లి ఉమా ప్రణతి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కొర్రా యశోద, పట్టణ మహిళా అధ్యక్షురాలు కొంగర మంజీరా, కౌన్సిలర్ పెదలంక లక్ష్మీ, లావణ్య, మన్నవ శాంతి శ్రీ, షేక్ జకీర, షేక్ ఇస్రాత్ తదితరులు పాల్గొన్నారు.

నివాసాల భవిష్యత్ సోలార్ తోనే

ప్రజాశక్తి - చేబ్రోలు

సౌర శక్తితో ఉచిత విద్యుత్ పొంది ప్రకాశవంతంగా ఉండండని, నివాసాల భవిష్యత్ సోలీర్‌తోనే అని సోలారాక్ టెక్నాలజీస్ కంపెనీ ఆథరైజ్ డీలర్ గట్టుపల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు . ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద రూ. 78000/- వరకు సబ్సిడీతో 30 సంవత్సరాల వరకు ఉచిత విద్యుత్ పొందే అవకాశం మా సోలార్ కంపెనీ ద్వారా ఉందని ఆయన అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ పథకానికి తక్కువ వడ్డీ రేటుకే, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, రుణాలు లభిస్తాయని చెప్పారు. భారత ప్రభుత్వ పథకమైన ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా సోలార్ సేవలు అందించటానికి సోలారాక్ టెక్నాలజీస్ కంపెనీ అధికారికంగా ఎంపికైందని డీలర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అంతటా తమ కంపెనీ బ్రాంచ్‌లు ఉన్నాయి అన్నారు . కస్టమర్ పెట్టుబడి, నెలవారి యూనిట్లు, నెలవారి బిల్లు పొదుపు, డౌన్ పేమెంట్ మొత్తం లోను, ఐదు సంవత్సరాలు ఈఎంఐ లాంటి మరిన్ని వివరాల కోసం ఆఫీస్ నంబర్ 72860 44555 ద్వారా తెలుసుకోవచ్చు అన్నారు.

నేడు 32వ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి

శ్రీ వేంకటేశ్వర యోగ సేవా కేంద్రాన్ని స్థాపించి 31 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ వేంకటేశ్వర యోగి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆగస్టు 10వ తేదీన ఆదివారం సేవా కేంద్రం సేవలను కొనియాడుతూ కవితలు పాటలు పద్యాలు వ్యాసాలను రచించి తమ శాఖలలో అందజేయ వలసినదిగా యోగా అభిమానులను కోరారు.

తాడేపల్లిలో ఘనంగా ఆదివాసి దినోత్సవం

ప్రజాశక్తి - తాడేపల్లి

ఆదివాసుల జీవితాలలో వెలుగులు నింపడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలుగుదేశం పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం తాడేపల్లి ఎంటిఎంసీ కార్యాలయం ఎదుట ఉన్న ఏకలవ్య, అంబేద్కర్ విగ్రహాలకు టీడీపీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలను మైదాన ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చేయాలని ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, ఎస్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు ఇట్టా భాస్కర్, ఇట్టా పెంచలయ్యకళ్ళం బాపిరెడ్డి, అద్దంకి మురళి, తాడిబోయిన భాస్కర్, తాడిబోయిన గోపి, దుర్గారావు, ఇలియాజ్, దేవుళ్ళ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఏకలవ్య, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న నాయకులు

దళిత యువకుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుశీలరావు

ప్రజాశక్తి - పెదకాకాని

దళిత యువకుడిపై వైసీపీ నాయకుల దాడి హేయనీయమని రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సుశీలరావు, రాష్ట్ర టిడిపి నాయకులు కొర్రపాటి సురేష్ అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతిలో పవన్ అనే దళితుడిని గదిలో బంధించి చిత్ర హింసలకు గురిచేసిన భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు అభినయ రెడ్డి వారి అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని లేని పక్షంలో రాష్ట్ర స్థాయిలో దళితులంతా ఏకమై ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వైసీపీ నాయకులు ఇంకా వారి ప్రభుత్వం అధికారంలో ఉన్నారని భ్రమలో ఉన్నారని, తమ ప్రభుత్వంలో దళితులను చంపి డోర్ డెలివరీ చేసిన ఘటనలు, డాక్టర్ సుధాకర్ మరణానికి ఏ విధంగా కారకులయ్యారో ప్రజలు అందరూ మర్చిపోలేదన్నారు. ఈ సమావేశంలో ఆత్మకూరు వెంకటేశ్వర్లు, బి.వెంకట్రావు, బి.మోజెస్,బి.చుక్కరావు, యోహాన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పేదరికాన్ని జయించడంలో విద్య ప్రధాన ఆయుధంగా పనిచేస్తుందని బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి బి.ఆనంద్ కిరణ్ అన్నారు. కొలకలూరు గ్రామంలోని రత్నకుమారి ట్యూషన్ సెంటర్లోని నిర్వహించిన నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గున్నారు. స్థానికులతో కలసి విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో సుదర్శన్, రావూరి శ్యామ్ సుందర్, కోడూరు మోజేశ్, రావూరి భరద్వాజ పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణి చేసున్న ఆనంద్ కిరణ్ తదితరులు

హజ్ యాత్రికులకు ఆర్థికసాయం విడుదలపై హర్షం

ప్రజాశక్తి - మంగళగిరి

హజ్ యాత్రికులకు ఆర్థికసాయం విడుదలపై మైనారిటీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు, దుగ్గిరాల ఎంపీపీ షేజ్ జబీన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మరో ఎన్నికల హామీని నెరవేర్చిందని అన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 2025-హజ్‌యాత్రకు వెళ్లి సఫలం చేసుకొని వచ్చిన 72 మంది యాత్రికుల వ్యక్తిగత ఖాతాల్లోకి ఈ నెల 06 తేదీన నేరుగా ఒకొక్కరికి రూ. లక్ష చొప్పున మొత్తం రూ. 72 లక్షలు జమ చేయడం జరిగిందన్నారు. మంజూరు చేసిన 24 గంటల వ్యవధిలోనే నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి నగదును ప్రభుత్వం జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ రియాజ్, ఎండీ నిజాముద్దీన్, అబ్దుల్ మజీద్, షేక్ హుస్సేన్, షేక్ నాగుల్ మీరా, షేక్ ఫిరోజ్, పఠాన్ జానీ ఖాన్, షేక్ సుభాని, మొహమ్మద్ జాలాలుద్దీన్, పఠాన్ అబ్దుల్లా ఖాన్, పఠాన్ జున్ను ఖాన్, షేక్ నజీర్, పఠాన్ ఫిరోజ్ ఖాన్, ఎండీ ఆరిఫ్, హుస్సేన్ బేగ్, షేక్ కరిముల్లా, సలావుద్దీన్, షేక్ అన్వర్, షేక్ షమీరా, షేక్ బుడే, హుస్సేన్, చిన నాగుల్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

మాతాశిశు మరణాలు తగ్గించడానికే కిల్కారి కాల్స్

ప్రజాశక్తి - పెదకాకాని

మాతా శిశు మరణాలు తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కిల్కారి కాల్స్ ప్రవేశ పెట్టిందని ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజు తెలియజేశారు. మండల కేంద్రమైన పెదకాకానిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆరోగ్య పరీక్షలకు వచ్చిన గర్భిణీలకు కిల్కారి కాల్ గురించి అవగాహన కలిపించారు. కిల్కారి కాల్ యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కిల్కారి వాయిస్ కాల్స్ వారానికి ఒక సారి గర్భిణీ, బాలింతల యొక్క మొబైల్స్‌కి వస్తాయని, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్కారి కాల్ నెంబర్ 01244451660, ఈ కాల్ నెంబర్‌ని గర్భిణీలు మరియు బాలింతలు వాళ్ళ మొబైల్‌లో సేవ్ చేసుకున్నట్లు అయితే కాల్ వచ్చినపుడు ఎత్తి పూర్తిగా సమాచారాన్ని వినగలుగుతారు. ఒక వెళ్ళ మరల తిరిగి ఆ సమాచారాన్ని వినాలి అంటే 14423 అనే టోల్ ఫ్రీ నెంబర్‌కి చేసి వినవచ్చు అన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ దీప్తి, పీహెచ్ ఎన్.పద్మ, ఎంపీ హెచ్‌ఎస్ సుకుమార్, హెచ్‌వి దేవి, మండలంలోని ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ గర్భిణీలు పాల్గొన్నారు.



గర్భిణీలకు అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ రాజు




దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

249వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 249 రోజులకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ కార్యదర్శి కూరపాటి స్టీవెన్, షేక్ సుభాని ప్రారంభించారు. దీక్షలలో దామవరపు నాగేశ్వరావు, షేక్ ఇమాంబి, ఈదులముడి శరమ్మా, ఎం.శివకుమారి, దర్శి నాగమల్లీశ్వరిలు కూర్చున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కేస్టీవెన్ మాట్లాడుతూ అసలు యజమాని ఏసీసీ, బంబాయి వారు ఎంతో చరిత్ర కలిగిన తాడేపల్లి సిమెంట్ పరిశ్రమను అసమర్థుల చేతిలో పెట్టి ఫ్యాక్టరీని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో వై.సాంబశివరావు, బి.అంకయ్య, బి.సూర్యప్రకాశరావు, ఎం.ఆశీర్వాదం, ఎం.గురవయ్య, హగ్గయ్య, పిచ్చయ్య, తుపాకుల నాగేశ్వర రావు, టి.దుర్గాభవాని, ఈ. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రియాంక

విద్యార్థులకు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక నాజరుపేట బిసి బాలుర వసతి గృహంలో శనివారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక పాల్గొని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రతకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. మలమూత్ర విసర్జనలు, భోజనానంతరం చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వసతిగఅహ సంక్షేమాధికారి జెట్టి మరియదాస్, ఆరోగ్య సిబ్బంది ఎ.బాలచంద్రమౌళి, డి.జయంతి, మలేరియ హెల్త్ అసిస్టెంట్స్ దీపాలశ్రీనివాసరావు, ఎ.వేణుగోపాలరావు, షేక్ సంధ్య, వసతి గృహ సిబ్బంది జి.పరంజ్యోతి, యు. ఝాన్సీరాణి, కె.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

ఒబిసి మహాసభ విజయవంతం : కేసన

ప్రజాశక్తి - మంగళగిరి

ఈనెల 7న గోవాలో జరిగిన 10వ జాతీయ ఓబీసీ మహాసభ విజయవంతమైందని ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు శనివారం తెలిపారు. జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో, రాష్ట్రీయ ఒబీసీ మహా సంఘం అధినేత ప్రొఫెసర్ భవన్ రావు తైవాడే అధ్యక్షతన ఈ మహాసభ జరిగిందన్నారు. ఈ మహాసభకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, గోవా సీఎం ప్రమోద్ సావంత్, ఏఐసిసి ప్రధాన కార్యదర్శి మాణిక్యరావు ఠాగూర్ ముఖ్య అతిథులుగా, పలు రాష్ట్రాల మంత్రులు-అఖిలపక్ష పార్టీల నేతలు-18 రాష్ట్రాల ఓబీసీ ప్రతినిధులు హాజరైనట్లు తెలిపారు. అనంతరం జరిగిన మహాసభలో పలువురు ప్రముఖులు మాట్లాడారని తెలిపారు. ఏపీ అధ్యక్షులు కేసన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్నా, దేశ జనాభాలో 60 శాతంగా ఉన్న ఓబీసీలకు అన్ని రంగాలలో 18 శాతం వాటా కూడా దక్కలేదన్నారు. గత పది సంవత్సరాలుగా 10 రాష్ట్రాలలో ప్రతి ఏటా ఓబిసి మహాసభలను వేలాది మందితో నిర్వహిస్తున్నామన్నారు.



విగ్రహావిష్కరణలో ఎమ్మెల్సీ ఆలపాటి, రాజకుమారి తదితరులు

గొప్ప అభ్యుదయ కవి ఆలూరి బైరాగి

ప్రజాశక్తి - తెనాలి

సామాన్య రైతు కుటుంబంలో పుట్టి అసామాన్య కవితా సామర్థ్యాన్ని సంపాదించుకున్న గొప్ప అభ్యుదయ కవి ఆలూరి బైరాగి అని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆలూరి శతజయంతి ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఈదర వెంకట పూర్ణచంద్, చెరుకుమల్లి సింగారావు ఆధ్వర్యంలో స్థానిక అయితా నగర్లో ఆలూరి బైరాగి విగ్రహావిష్కరణ శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆలపాటి మాట్లాడుతూ కళల కాణాచి తెనాలికి ఆలూరి వంటి కవులు కళాకారులు మంచి గుర్తింపును తెచ్చారని కొనియాడారు. విగ్రహ దాత, రాజ్యసభ మాజీ సభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ బైరాగి విగ్రహం ఆయన జన్మస్థానమైన ఐతానగర్‌లో ప్రతిష్ఠించటం తమ అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్పర్సన్ నన్నపనేని రాజకుమారి, ప్రముఖ రచయిత ముత్తేవి రవీంద్రనాథ్, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, బండ్ల మాధవరావు, కొత్తపల్లి రవిబాబు, వెన్న వల్లభ రావు, గోళ్ళ నారాయణ, రైతు నాయకులు ఈదర పూర్ణచంద్, రోటరీ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు, కె.బెన్‌హర్, డి.ఎల్.కాంతారావు, ఈదర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు మంగళగిరిలో కెవిపిఎస్ జిల్లా మహాసభ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు... సామాజిక న్యాయం అంశంపై సదస్సు

ప్రజాశక్తి - మంగళగిరి

కెవిపిఎస్ గుంటూరు జిల్లా ఆరవ మహాసభ ఆదివారం సాయంత్రం మూడు గంటలకు స్థానిక టిప్పర్ల బజారులోని సంస్థ కార్యాలయంలో జరుగుతుందని పట్టణ కార్యదర్శి వై.కమలాకర్ శనివారం తెలిపారు. అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు... సామాజిక న్యాయం అంశంపై సెమినార్ జరుగుతుందని తెలిపారు. ప్రధాన ఉపన్యాసకులుగా దళిత్ శోషణ్ ముక్తి మంచ్ జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సామ్యేల్ ఆనందకుమార్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, కెవిపిఎస్ జిల్లా నాయకులు బి.వెంకటేశ్వర్లు, పాల్గొంటారని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

జాతీయ స్థాయి వాటర్ పోలో పోటీలకు మొహిద్దీన్ ఎంపిక

అభినందించిన ఎమ్మెల్యే అరవిందబాబు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



గుజరాత్ స్టేట్ ఆక్వాటిక్ అసో సియేషన్, స్విమ్మింగ్ ఫెడరేషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 13 నుండి 17వ తేదీ వరకు అహ్మ దాబాద్‌లో నిర్వహించనున్న 78వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ ఛాంపియన్ షిప్స్ -2025 (వాటర్ పోలో) పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు ఈత శిక్షకుడు చందోల్ వాసి షేక్. ఖాజా మొహిద్దీన్ చందోల్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పోటీలలో పాల్గనడానికి శనివారం అహ్మదాబాద్ బయలుదేరుతున్న ఖాజా మొహిద్దిన్ ను ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్ బాబు అభినందించారు. గతంలో అనేక జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గన్న అనుభవం కోచ్ మొహిద్దిన్ కు ఉన్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.

టిడిపిలో పెరుగుతున్న అంతర్యుద్ధం



7 వీక్షణం

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని టిడిపి నాయకుల మధ్య అంతర్యుద్ధం తీవ్ర రూపం దాలుస్తోంది. ఎక్కడికక్కడ ఆధిపత్య పోరు జరుగుతోంది. మెజార్టీ నియోజవకవర్గాల్లో ఒకరిని దెబ్బతీసుకునేందుకు మరొకరు ప్రయత్నిస్తున్నారు. రాజకీయంగా ఎత్తుకు పై ఎత్తులు వేయడం ఒక పరిణామం అయితే సొంత పార్టీ వారే ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ ఇబ్బంది పెట్టడం ద్వారా పార్టీ ప్రతిష్టకు భంగం కల్గిస్తున్నారు. రాజకీయంగా పదవులు అనుభవిస్తూనే వ్యాపార వ్యవహారాల్లో అడ్డం వచ్చిన వారిని తొక్కుకుంటూ వెళ్లాలన్న భావనలో ఉన్నారు. అవకాశం దొరికితే ఎదుట వారిని దెబ్బతీసేందుకు వెనుకాడటం లేదు. జిల్లాలో ఎక్కువ మంది ఎమ్మెల్యేలు, వీరి బినామీలు వివిధ వ్యాపారాల్లో వాటాలు, నెలవారీ మామూళ్లు డిమాండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. మద్యం, రేషన్, మట్టి, ఇసుక, సహజ వనరులు విక్రయాల్లో ఎవరి వాటాలు వారికి అందాల్సిందే. లేదంటే ఎంతకయినా తెగిస్తున్నారు. అలాగే రియల్ ఎస్టేట్ రంగంలో కూడా వెంచర్లు వేసే వారిని బెదిరిస్తున్నారని ప్రభుత్వానికి నిఘా వర్గాల నుంచి నివేదికలు వెళ్తున్నాయి. గతంలో వైసిపి హయంలో ఏయే వర్గాల నుంచి ప్రజా ప్రతినిధులు నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారో ఇప్పుడు టిడిపి నేతలు కూడా అదే బాటలో పయనిస్తున్నారు. కొన్ని చోట్ల వైసిపి, టిడిపి నేతలు పాలు నీళ్లలా కలిసిపోతున్నారు. దీంతో సాధారణ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. కూటమి పాలన వైసిపికి జిరాక్స్‌కాపీగా ఉందన్న విమర్శలు పలు నియోజకవర్గాల్లో గుప్పుమంటున్నాయి. తాజాగా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి భర్త రామచంద్రరావు గత ఏడాది కాలంలో రియల్ ఎస్టేట్ రంగంలో దూసుకుపోతున్నారు. భారీగా వెంచర్లు వేస్తున్నారు. ఈనేపథ్యంలో పొన్నూరు నియోజకవర్గంలో భూముల కొనుగోలు వివాదస్పదం అయింది. పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్లకు ప్రధాన అనుచరులు తమను ఎకరాకు రూ.10 లక్షలు డిమాండ్ చేశారని గళ్ళా రామచంద్రరావు వర్గీయులు పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లడంతో ఈ వ్యవహారం జిల్లాలో పెను సంచలనంగా మారింది. జిల్లాలో అత్యంత సీనియర్ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర మీద గతంలో ఎన్నడూ లేని విధంగా అవినీతి ఆరోపణలు రావడం, ఆయన్ను పార్టీ అధిష్టానం వివరణ కోరడం కూడా జరిగింది. ఈ అంశంపై కూడా మంత్రి నారా లోకేష్ వద్ద పంచాయతీ జరిగినట్టు తెలిసింది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వర్గీయులుగా కొంత మంది వివిధ వర్గాల నుంచి భారీగా సొమ్ములు వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. మద్యం దుకాణాల వారు మామూళు ఇవ్వకపోతే టిడిపి వర్గీయులు తమ అనుయాయులతో దుకాణాల ఎదుట ధర్నాలు చేయిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నశీర్ అహ్మద్‌కు వ్యతిరేకంగా ఒక వర్గం క్రియాశీలకంగా పనిచేస్తుంది. ఆ వర్గం పార్టీలోని కొంత మంది కీలక నాయకుల ఆశీసీస్సులతో నశీర్‌కు వ్యతిరేకంగా ఎప్పటికపుడు పావులు కదుపుతున్నారు. ఇటీవల ఒక మహిళతో ఆయన వీడియో కాల్ లో మాట్లాడినట్టు వచ్చిన వీడియో వివాదస్పదం అయింది. దీని వెనుక పార్టీలోనే ఒక వర్గం నాయకులు ఉన్నట్టు నశీర్ అనుమానిస్తున్నారు. గుంటూరు ఎన్‌టిఆర్ స్టేడియం పాలక వర్గానికి ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. ఈనెల 18న పాలకవర్గం ఎన్నికలు జరగాల్సి ఉండగా టిడిపిలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు తీవ్రం కావడంతో మేయర్ కోవెలమూడి రవీంద్ర ఏకంగా ఎన్నికలను వాయిదా వేశారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవికి వ్యతిరేకంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ వర్గం మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డికి అనుచరుడుగా ఉన్న వజ్జా రామకృష్ణను ప్రతిపా దించడంతో రగడ మొదలైంది. చివరికి ఈ పంచాయతీ మంత్రి నారా లోకేష్ వద్దకు చేరింది. లోకేష్ జోక్యం చేసుకోవడంతో ఎన్నిక వాయిదా పడింది.

- ఎ.వి.డి.శర్మ

కిడ్నీ బాధితులకు డయాలసిస్ పరికరాలు అందుబాటులో ఉంచాలి

ఎయిమ్స్ పాలకమండలి సభ్యులు ఎంపీ కేశినేని శివనాథ్

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరి ఎయిమ్స్ జరిగిన పాలకమండలి సమావేశానికి హాజరైన ఎంపీలు

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో తిరువూరు నియోజకవర్గం ఎ.కొండూరు మండలంలో కిడ్నీ బాధితులు ఎక్కువగా ఉన్నారు, వారంతా ఎయిమ్స్‌కి వస్తున్నందున, వారికీ అవసరమైన డయాలసిస్ పరికరాలు అందు బాటులో ఉంచాలని, ఆసుపత్రిలో పరికరాలు తగ్గితే తెప్పించాలని ఎయిమ్స్ డైరెక్టర్ శాంతా సింగ్‌ను ఎయిమ్స్ పాలకమండలి సభ్యుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ సూచించారు. మంగళగిరి ఎయిమ్స్ 11వ గవర్నింగ్ బాడీ సమావేశం శనివారం మంగళగిరి ఎయిమ్స్ అడ్మిన్ అండ్ లైబ్రరీ బిల్డింగ్ లో జరిగింది. పాలకమండలి సభ్యుల హెూదాలో ఈ సమావేశానికి విచ్చేసిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎంపీ బాలశౌరి కి ఎయిమ్స్ డైరెక్టర్ శాంతా సింగ్ స్వాగతం పలికారు అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ ఎయిమ్స్ ప్రాంగణంలో మొక్కను నాటడం జరిగింది.మంగళగిరి ఎయిమ్స్ 11వ గవర్నింగ్ బాడీ సమావేశంలో ఎంపి కేశినేని శివనాథ్, ఎంపీ బాలశౌరీ, డైరెక్టర్ శాంతా సింగ్‌తో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు. హైబ్రిడ్ పద్ధతిలో జరిగిన ఈ సమావేశంలో కొంతమంది సభ్యులు ఆన్ లైన్‌లో జాయిన్ అయ్యారు. సమావేశంలో ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ పేద ప్రజలు ఎక్కువగా ఈ హాస్పటల్ కి అందుతగ్గట్లుగా సదుపాయాలు కల్పించాలన్నారు. రోగులు ఎక్కడ ఇబ్బంది పడకుండా మెరుగైన వైద్యం వారికి అందెందుకు కావాల్సిన చర్యలు చేపట్టాల్సిందిగా సూచించారు. ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ రోగుల పట్ల శ్రద్ధ వహించడానికి అవసరమైన స్థాయిలో డాక్టర్ లు, ఇతర సిబ్బంది ఉండాలని, లేని పక్షంలో సిబ్బందిని నియమించుకోవాలని తెలిపారు. మంగళగిరి ఎయిమ్స్ నేషనల్ హైవే 16 పక్కనే ఉన్నందున, రోడ్డు ప్రమాద బాధితుల కోసం అత్యవసర ట్రామా విభాగం నెలకొల్పాలని, అందువలన రోడ్డు ప్రమాద బాధితులకు వెంటనే సరైన వైద్యం అందే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

ఆవిష్కరణల సూచీలో దేశాన్ని అగ్రభాగాన నిలపాలి

ఆర్‌విఆర్ జెసి గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో జస్టిస్ ఎన్.వి.రమణ

ప్రజాశక్తి - గుంటూరు



డిగ్రీ పట్టాలు అందచేస్తున్న జస్టిస్ ఎన్.వి.రమణ

సాంకేతికతలో నిత్యం పెరుగుతున్న పురోగతిని దృష్టిలో ఉంచుకొని, ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారిస్తూ, నూతన ఆవిష్కరణలు జరపాలని భారత సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ అన్నారు. శనివారం స్థానిక చౌడవరంలోని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి 10వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ రమణ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో అద్భుతాలను సృష్టించడమే కాకుండా, సమస్యల పరిష్కారాలకు మార్గాలను సులభంగా శోధించవచ్చని, ఇటీవలి నివేదిక ప్రకారం, భారతదేశంలోని 15 లక్షల ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో కేవలం 10శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని, ఐఐటిలలో ప్లేస్‌మెంట్ రేటు తగ్గుతుందన్నారు. 2024లో ఐఐటి గ్రాడ్యుయేట్లలో కేవలం 60శాతం మంది మాత్రమే ప్లేస్‌మెంట్ పొందటం ఆందోళన కలిగించే అంశమని, అమెరికాలో నూతనంగా ప్రవేశపెట్టిన కొన్ని ఆంక్షలు భారతీయులకు కొంత ఆందోళనను కలగజేస్తున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి మాట్లాడుతూ విజన్ ఆంధ్ర- 2047 లక్ష్యమని, ఇంజినీరింగ్ విద్యార్థులు తమ ముందున్న సమస్యలను అవకాశాలుగా మార్చుకొని వాటికి పరిష్కార మార్గాలను సాధించాలన్నారు. 2021 - 25 సంవత్సర 37వ బ్యాచ్ విద్యార్థులలో వివిధ బ్రాంచ్‌లకు చెందిన డిగ్రీ పూర్తి చేసుకున్న 1023 మంది విద్యార్థులకు ఇంజినీరింగ్ డిగ్రీ పట్టాలను, 153 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లకు పి.జి పట్టాలను, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. తొలుత కళాశాల ఆవరణ లోని రాయపాటి వెంకట రంగారావు, జాగర్లమూడి చంద్రమౌళి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ ఆర్.శైలజ, కళాశాల సెక్రటరీ రాయపాటి గోపాలకృష్ణ, పాలక మండలి సభ్యులు పి.గోపిచంద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

విజయం సాధించిన ఎం.బుక్ కార్మికులు

కాంట్రాక్టర్ హామీతో నిరసన విరమణ



ఎం బుక్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు వి.వి.జవహర్‌లాల్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో గల ఎం బుక్ కార్మికులు సంఘటితముగా ఉండి పోరాటం చేసి విజయం సాధించారని సిఐటియు నాయకులు వి.వి.జవహర్‌లాల్ అన్నారు. శనివారం రాత్రి మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో ఎం బుక్ కార్మికుల విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్.ఎస్. చెంగయ్య మాట్లాడుతూ ఎం బుక్ కార్మికుల శ్రమ దోపిడీని నిరసిస్తూ ఏడు రోజులు పాటు ఆందోళన చేసి విజయం సాధించడం జరిగిందని అన్నారు. ఎంతటి సమస్య అయినా సంఘటితంగా ఉంటేనే పోరాటం విజయం అవుతుందని అన్నారు. కాంట్రాక్టర్ నెలకు 11,000 రూపాయలు వేతనం, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. అంతేకాకుండా నెలకు నాలుగు రోజులు సెలవులు ఇస్తామని చెప్పడం జరిగిందని అన్నారు. అందువలన నిరసన కార్యక్రమాన్ని నిరసన కార్యక్రమాన్ని విరమించినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మంగళగిరి పట్టణ నాయకులు పుణ్యవతి, రజిని పాల్గొన్నారు.